క్లుప్తంగా

పంచాయతీల పురోభివృద్ధికి సహకరించాలి



శిక్షణ తరగతుల్లో ప్రసంగిస్తున్న ఎంపీడీఓ శ్రీలలిత

పెద్దాపురం: పంచాయతీల పురోభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ శ్రీలలిత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలకు పంచాయతీల పురోభివృద్ధి, యాక్షన్ ప్లాన్‌పై ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారుల సమష్టి కృషి అవసరమన్నారు. పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని, పారిశుధ్యం మెరుగుపరిచాలని ఎంపీడీఓ కోరారు. అనంతరం పలు అంశాలపై ప్రజా ప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు. మండల విస్తరణాధికారి శేఖర్‌రెడ్డి, వెలుగు ఏపీఎం సూర్యనారాయణ, సర్పంచులు కొత్త చక్రరావు, దిమ్మల పుష్పరత్నం, ఎంపీటీసీ భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

6, 7 తేదీల్లో నాటికల ప్రదర్శన



అమెరికా కామెడీ నాటికల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు

బోట్‌క్లబ్: వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, ది యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 6, 7 తేదీల్లో కాకినాడ దంటు కళాక్షేత్రంలో 'అమెరికా కామెడీ నాటికలు' ప్రదర్శించనున్నారు. నాటికల బ్రోచర్‌ను ప్రముఖ రచయిత, యూట్యూబర్ రవి మంత్రి చేతుల మీదుగా గురువారం దంటు కళాక్షేత్రంలో ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొనున్న ప్రముఖ నటులు, రచయిత తనికెళ్ల భరణికి ఈ నెల 7న ।జీవన సాఫల్య పురస్కారం₹ ప్రదానం చేస్తున్నట్లు వంగూరి ఫౌండేషన్ అధ్యక్షుడు వంగూరి చిట్టెన్ రాజు తెలిపారు. నాటక రంగ నిపుణులు ఆచార్య బీవీ రమణ మూర్తి, ఆచార్య డీఎస్ఎన్ మూర్తిలకు ఆత్మీయ సత్కారం చేస్తున్నట్లు దంటు భాస్కర్ తెలిపారు. బ్రోచర్ ఆవిష్కరణలో మూర్తి జానకి రామ చౌదరి, ప్రభుదాసు, కట్టా కృష్ణారావు, బాలాంత్రపు సుచిత్రామూర్తి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తున్న యూరియా కొరత

కోటనందూరు: కాకరాపల్లి గ్రోమోర్ సెంటర్‌కు యూరియా కోసం గురువారం రైతులు పోటెత్తారు. బస్తా యూరియా కోసం రోజంతా క్యూలో నిలబడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆధార్ కార్డు, భూమి పాస్‌బుక్ తెచ్చుకోవాలని రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ప్రైవేటు షాపులకు భారీగా యూరియాను అమ్మేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేటు దుకాణాల్లో రూ.400కు విక్రయిస్తున్నారన్నారు. యూరియా అక్రమంగా విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఏజీపీగా మురళీధర్



కాకినాడ లీగల్: ల్యాండ్ రిఫార్మ్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎల్ఆర్ ఏటీ) కమ్ కాకినాడ నాలుగో అదనపు జిల్లా జడ్జి కోర్టుకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా న్యాయవాది అద్దేపల్లి మురళీధర్ నియమిస్తూ ప్రభుత్వ సెక్రటరీ జి.ప్రతిభాదేవి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన కాకినాడ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఈ విధులు మూడేళ్ల కాలపరిమితిగా నిర్ణయిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సమాధుల కూల్చివేత తగదు



తునిలో శ్మశాన వాటికను పరిశీలిస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

తుని: అభివృద్ధి పేరిట స్థానిక కొండవారిపేట శ్మశానవాటికలో సమాధులను కూల్చడం తగదని సీఐటీయూ పట్టణ కన్వీనర్ నక్కెళ్ల శ్రీనివాస్ మండిపడ్డారు. సమాధులు కూల్చుతున్న ప్రాంతాన్ని సంఘ ప్రతినిధులతో కలిసి గురువారం సందర్శించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజలకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా, అభివృద్ధి పేరుతో సమాధులను కూల్చడమంటే ప్రజల మనోభావాలను కించపర్చడమేనన్నారు. చనిపోయిన వారిని పవిత్రంగా భావించే ఈ సమాజంలో మున్సిపల్ అధికారులు ఏకపక్షంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. మున్సిపల్ అధికారులు ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. శ్మశానవాటిక భారీగా ఆక్రమణకు గురైందని, దానిని వెలికితీయాలని డిమాండ్ చేశారు.

ఆవునండి అవస్థలే..!

- రోడ్లపైకి విచ్చలవిడిగా పశువులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు
- పట్టించుకోని అధికారులు



సామర్లకోట రాజీవ్ గృహకల్ప వద్ద రోడ్డుపై తిష్టవేసిన ఆవులు

సామర్లకోట: పశువులను రోడ్లపైకి వదిలేస్తున్నారు.. నడిచే స్పీడ్ బ్రేకర్లుగా అవి మారి ప్రయాణికులకు విసుగు పుట్టిస్తున్నాయి.. ఇటీవల కాలంలో పశువులు రహదారులపై విచ్చలవిడిగా తిరుగుతూ నరకం చూపుతున్నాయి. చాలాచోట్ల వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. సామర్లకోట స్టేషన్ సెంటర్, మఠం సెంటర్, కూరగాయల మార్కెట్ సెంటర్, మెహర్ కాంప్లెక్స్, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, సీబీఎం సెంటర్, బ్రౌన్‌పేట సెంటర్లలో ఎక్కువగా ఆవులు రోడ్లపై బైఠాయిస్తున్నాయి. రోడ్లపై ఉన్న పశువులను దగ్గరకు వచ్చే వరకు గమనించని వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలా ఇప్పటికే అనేక ఘటనలు చోటుచేసుకున్నాయి. రోడ్డుకు అడ్డుగా ఉంటున్న ఆవుల యజమానులపై పోలీసులు, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉండగా, పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల మున్సిపల్ అధికారులు పశువులను రోడ్లపైకి వదలరాదంటూ మైక్ ద్వారా ప్రచారం చేసి చేతులు దులుపుకొన్నారని పలువురు అంటున్నారు. పశువులు రోడ్లపై బైఠాయిస్తే వాటిని బందుల దొడ్డికి తరలించి, ఆవుల యజమానులకు అపరాధ రుసుం విధించి చర్యలు తీసుకోవాలనే డిమాండ్ ఉంది. బందులదొడ్డిలో పెట్టినా స్పందించని యజమానుల ఆవులను కాకినాడలోని గోశాలకు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

దుర్వాసన భరించలేక..

గతంలో పచ్చగడ్డి తినడం వల్ల ఆవు పేడను ప్రతిఒక్కరూ ఇంటి వద్ద కళ్లాపు తదితర వాటికి ఉపయోగించుకునేవారు. ప్రస్తుతం ఆవుపేడ భరించలేని వాసన వస్తుందని స్థానికులు వాపోతున్నారు. ఆవులకు చెందిన యజమానులు ఆవులు పాలు ఇవ్వకపోవడంతో రోడ్లపై విడిచి పెడుతున్నారు. దాంతో రోడ్లపై ఉన్న చెత్త కాగితాలు, ఆకులు, ప్లాస్టిక్ కవర్లను తింటున్నాయి. దాంతో ఆవు పేట భరించలేని చెడు వాసన వస్తుందని అంటున్నారు. రాత్రి సమయంలో షాపులు మూసిన తర్వాత చినుకులు పడితే ఆవులు ఆయా షాపుల వద్దకు చేరుతున్నాయి. రాత్రి అక్కడే ఉండి చిందరవందర చేస్తున్నాయి. దాంతో ఆయా షాపుల యజమానులు పేడను శుభ్రం చేసుకోవడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

గుంపులుగా ఉంటూ..



ట్రాఫిక్ ఎక్కువగా ఉండే రోడ్లపై ఆవులు గుంపులు, గుంపులుగా రాత్రి సమయంలో నిద్రించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనచోదకులు దగ్గరకు వచ్చే వరకూ ఆవులను గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనిపై అనేక పర్యాయాలు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదు. కౌన్సిల్ సమావేశంలో చర్చించినా ఫలితం శూన్యం. పోలీసులు చర్యలు తీసుకోవాలి.

– కరణం రాజ్‌కుమార్, కౌన్సిలర్, సామర్లకోట

ప్రచారం చేసి చేతులు దులుపుకొన్నారు



రోడ్లపై నిద్రిస్తున్న పశువులకు సంబంధించి మున్సిపల్ అధికారులు నెల రోజుల కిందట మైక్‌లో ప్రచారం చేశారు. రోడ్లపై కాగితాలు, ప్లాస్టిక్ కవర్లను ఇవి తింటున్నాయి. గోశాలకు తరలించి దాతల ద్వారా వాటికి గడ్డి ఏర్పాటు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలి. గోశాలలో పశువుల పెంపకానికి దాతలు ముందుకు వచ్చే అవకాశం ఉంది.

– పిట్టా సత్యనారాయణ, కౌన్సిలరు, సామర్లకోట

విశాలాక్షినగర్‌లో అన్నసమారాధన



సామర్లకోట విశాలాక్షినగర్‌లో అన్న ప్రసాదం స్వీకరిస్తున్న దృశ్యం

సామర్లకోట: స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం సమీపంలో ఉన్న విశాలాక్షినగర్‌లో గురువారం అన్నసమారాధన నిర్వహించారు. ఆ ప్రాంత మహిళల ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న విషయం విధితమే. ఇందులో భాగంగా గురువారం పూజలు చేశారు. అనంతరం అన్నదానం జరిపారు. సుమారు రెండు వేల మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు ఆటో స్టాండ్‌లో..

సామర్లకోట: స్థానిక బసివిరెడ్డి సత్రం వద్ద ఉన్న శ్రీలక్ష్మీగణపతి ఆటో స్టాండ్ వద్ద శుక్రవారం భారీ అన్నసమారాధన జరుగుతుందని యూనియన్ అధ్యక్షుడు చిన్నా తెలిపారు. గణపతి నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని సుమారు పది వేల మందికి అన్నదానం చేయాలని నిర్ణయించినట్లు వివరించారు.

ఫ్లై ఓవర్‌పై ట్రాఫిక్ జామ్



సామర్లకోట ఫ్లై ఓవర్‌పై బారులు తీరిన వాహనాలు

సామర్లకోట: స్థానిక ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై గురువారం సాయంత్రం ట్రాఫిక్ నిలిచిపోయింది. బ్రిడ్జిపై అడుగడుగునా గోతులు ఉండటంతో వాహనచోదకులు ఆ గోతులను తప్పించుకునే క్రమంలో ఎడమ వైపు నుంచి కుడివైపునకు వచ్చి వెళ్లాల్సి వస్తోంది. దాంతో ఎదురుగా వచ్చే వాహనాలకు మార్గం లేక ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. వారం రోజులుగా ఈ సమస్య మరింత ఎక్కువగా ఉందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో రద్దీగా ఉండే ఫ్లై ఓవర్‌పై గోతులను పూడ్చక పోవడంపై వాహనచోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం సమయంలో ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువవుతుంది. పెద్దాపురం - రాజానగరం ఎడీబీ రోడ్డులో ఉన్న కార్పొరేట్ కళాశాలల బస్సు 40 నుంచి 50 వరకూ రావడంతో బ్రిడ్జి రద్దీగా ఉంటుంది. ఇటువంటి సమయంలో వాహనాలు నిలిచిపోయి కళాశాలల విద్యార్థులు రోడ్డుపైకి దిగడంతో రాకపోకలు సాగించడానికి అవకాశం ఉండటం లేదనే విమర్శలు ఉన్నాయి. దీనికితోడు గణేశ విగ్రహ నిమజ్జనాలకు చెందిన వాహనాల ఊరేగింపుతో ట్రాఫిక్ సమస్య పెరిగింది. వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో పనిచేసి ఇళ్లకు చేరుకుందామనే వారు ట్రాఫిక్ సమస్యతో అసహనానికి గురవుతున్నారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై గోతులు ఏర్పడి ఆరు నెలలైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. గోతులు పూడ్చే వరకూ ట్రాఫిక్ సమస్య తప్పదని స్థానికులు వాపోతున్నారు.

సమాజ ప్రగతికి ఉపాధ్యాయులే దిక్సూచి



సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు సత్కారం

సామర్లకోట: సమాజ ప్రగతిలో ఉపాధ్యాయుని పాత్ర ఎనలేనిదని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సాయంత్రం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పాఠశాల నుంచే ప్రతి విద్యార్థి భవిష్యత్తు నిర్ణయించబడుతుందని సాయిరామకృష్ణ అన్నారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణ గొప్పదనాన్ని విద్యార్థులకు ఆయన వివరించారు. విద్యా కమిటీ చైర్మన్ అక్కిన చక్రధర్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అదే విధంగా స్థానిక ప్లీడర్ తోటలోని బ్రహ్మకుమారి కేంద్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 50 మంది ఉపాధ్యాయులను మదర్ థెరిసా వలంటరీ ఆర్గనైజేషన్, ఓంశాంతి బ్రహ్మకుమారిల ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమానికి మదర్‌థెరిసా వలంటరీ ఆర్గనైజేషన్ అధినేత జి.రాజు మాస్టారు అధ్యక్షత వహించారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా గోపాలకృష్ణ

ప్రతి ఏడాది సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలను ప్రభుత్వం అందిస్తుంది. ఇందులో భాగంగా జి.మేడపాడు గ్రామంలోని మోడల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కంటిపూడి గోపాలకృష్ణ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈ విషయాన్ని గురువారం మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య తెలిపారు.



కంటిపూడి గోపాలకృష్ణ

మరో ముగ్గురికి..

మండలంలో మరో ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య తెలిపారు. ఉందూరు ప్రకాశరావుపేటలోని ఎలిమెంటరీ పాఠశాలకు చెందిన కేఎంఎంఆర్ ప్రసాద్, బోయనపూడి ఎలిమెంటరీ పాఠశాలకు చెందిన ఎం.కామేశ్వరరావు, పట్టణంలోని బ్రౌన్‌పేట ఎలిమెంటరీ పాఠశాలలో ఉపాధ్యాయుడు డి.వీరన్నలు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని అన్నారు.

పెద్దాపురంలో ఏడుగురి ఎంపిక

పెద్దాపురం: అర్బన్, మండలం నుంచి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఏడుగురిని ఎంపిక చేసినట్లు పెద్దాపురం మండల విద్యాశాఖాధికారులు చౌదరి, శర్మ తెలిపారు. కట్టమూరు జెడ్పీహెచ్ఎస్ నుంచి యు.మీనామాధురి, ఆర్‌బీకొత్తూరు నుంచి కొండేపూడి నిత్యానందం, టి.కృష్ణమూర్తి, ఆర్‌బీ పట్నం స్కూల్ నుంచి కేటీవీఎన్ సత్యనారాయణ, చదలాడ హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు ఎం.సూర్యనారాయణ మూర్తి, పులిమేరు ఎంపీపీఎస్ స్కూల్ ఉపాధ్యాయురాలు జి.అన్నపూర్ణలు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారన్నారు. అలాగే పెద్దాపురం పట్టణం నుంచి లూథరన్ స్కూల్ హెచ్ఎం సీహెచ్ శామ్యూల్ విక్టర్‌బాబు ఎంపికైనట్లు వారు తెలిపారు.

'సరిపెల్ల'కు సత్కారం

బోట్‌క్లబ్: స్థానిక వేణుగోపాల సంస్కృత ప్రచార సభలో గణపతి నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్కృత ప్రచార సాహిత్య ఆధ్యాత్మిక కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సంస్కృత ప్రచార సభ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తిని ఘనంగా సన్మానించారు. దీనికి అధ్యక్షత వహించిన ఏయూ పీజీ సెంటర్ విశ్రాంత లెక్చరర్ టి.విశ్వనాథరావు మాట్లాడుతూ వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు చెబుతున్న విషయాలపై అవగాహన కోసం సంస్కృత ప్రచార సభ ఇటువంటి కార్యక్రమాలు తలపెట్టడం గొప్ప విషయమన్నారు. విశిష్ట అతిథి, సంస్కృత ప్రచార సభ గౌరవాధ్యక్షుడు జీవీ కృష్ణంరాజు మాట్లాడుతూ భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు సనాతన ధర్మం పట్ల ప్రతి ఒక్కరికీ ఆసక్తి పెరుగుతోందని అన్నారు. పండితులు అష్టావధాని కందుకూరి లక్ష్మీ నరసింహ మూర్తి గణపతి సాంఘిక మర్యాదపై ప్రసంగించారు. కార్యక్రమంలో సంస్కృత ప్రచార సభ అధ్యక్షుడు జీవీకే వర్మ, ప్రధాన కార్యదర్శి పీఎస్ఎస్ కిరణ్, ఉపాధ్యక్షుడు గంటి నాగేశ్వరరావు, కోశాధికారి చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన టీఓటీల శిక్షణ

సామర్లకోట: విస్తరణ శిక్షణా కేంద్రం పరిధిలోని శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకూ ఉన్న 11 జిల్లాల్లోని సీనియర్ పంచాయతీ సెక్రటరీలను టీఓటీలుగా ఎంపిక చేసి మూడు రోజుల పాటు స్థానిక ఈటీసీలో నిర్వహించిన శిక్షణ గురువారం సాయంత్రంతో ముగిసింది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై టీఓటీలకు శిక్షణ ఇచ్చారు. రెండో బ్యాచ్‌లో 114 మందికి శిక్షణ నిర్వహించగా, వారు ఆయా మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీలు ఎస్ఎస్ శర్మ, కె.సునీల, ఎం.చక్రపాణిరావు, పి.రామకృష్ణ, కె.శ్రీనివాసరావు, వి.జగన్నాథం, డి.శ్రీనివాసరావు, కేఆర్ నిహారిక పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో పూజలు



సర్వీస్ కమిషన్ సభ్యుడు సుధాకర్‌రెడ్డికి ఆశీర్వచనాలు అందజేస్తున్న అర్చకులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరీ సమేత కుమారరామ భీమేశ్వర స్వామి ఆలయంలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడు డాక్టర్ జీవీ సుధాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన వారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆలయ పండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

శిక్షణ పూర్తయిన యువతకు సర్టిఫికెట్ల ప్రదానం



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందించిన ప్రతినిధులు

కొత్తపల్లి: అరబిందో ఫార్మా ఫౌండేషన్ డైరెక్టర్ కె.నిత్యానందరెడ్డి ఆదేశాల మేరకు సెజ్ ప్రాంత గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా గురువారం మహిళా నైపుణ్యాభివృద్ధి కేంద్రం, ప్రతిభ కేంద్రాల ద్వారా ఉద్యోగ అవకాశాలపై శిక్షణ పూర్తి చేసుకున్న 89 మంది యువత, మహిళలకు పెరుమాళ్లపురంలోని క్యూలే ఫార్మా యూనిట్ హెడ్ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత తన మేధస్సును ఉపయోగించగలిగితే ఎందులోనైనా విజయం సొంతం చేసుకోవచ్చని అన్నారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వెళ్లిరా.. బొజ్జ గణపయ్యా

- గణేశ విగ్రహాల నిమజ్జనోత్సవాల జోరు



సామర్లకోట గోదావరి కాలువలో గణేశ విగ్రహ నిమజ్జనం

సామర్లకోట: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం గణేశ విగ్రహాల నిమజ్జనాల జోరు పెరిగింది. స్థానిక పంచారామ క్షేత్ర ఆలయ ముఖ ద్వారం వద్ద ఉన్న గోదావరి స్నానాల రేవులో నిమజ్జనాలు చేస్తున్నారు. రైల్వే గేటు, గూడ్స్ యార్డు వద్ద ఉన్న రేవుల్లోనూ నిమజ్జనాలు జరుగుతున్నాయి. గతంలో రైల్వే గేటు వద్ద ఉన్న రేవులో నిమజ్జనం సందర్భంగా ఒక యువకుడు మునిగిపోయాడు. దీంతో నాలుగేళ్లుగా అక్కడ నిమజ్జనాలు నిషేధించారు. కాగా ప్రస్తుతం అక్కడ రేవును మూసివేయక పోవడంతో నిమజ్జనాలు జరుగుతున్నాయి. పట్టణ, మండల పరిధిలో వివిధ గ్రామాలకు చెందిన వారితో పాటు పెద్దాపురం మున్సిపాలిటీ, మండల పరిధిలో గణపతి విగ్రహాలను సామర్లకోట గోదావరి కాలువలో నిమజ్జనం చేస్తున్నారు. గోదావరి కాలువలో వరద నీటి ప్రవాహం పెరగడంతో నిమజ్జనాలు జరుగుతున్న సమయంలో అటు పోలీసులు, ఇటు అధికారులు ఏర్పాట్లు చేయలేదని 'సాక్షి' దినపత్రికలో ఈ నెల 1న వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. గోదావరి కాలువ స్నానాల రేవులో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, రెయిలింగ్ వద్ద బారికేడ్లు పెట్టారు. దీనితో పాటు సీఐతో పాటు నలుగురు పోలీసు సిబ్బంది, ఒక వీర్వోను నియమించారు. అయితే గజ ఈతగాళ్లు కనిపించలేదు. గురువారం సుమారు 40 విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ నెల 7న చంద్రగ్రహణం కావడంతో ప్రతి మండపాల్లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలను 6, 7వ తేదీల్లో నిమజ్జనాలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



కొత్తపల్లి బీటు వీధిలో గణపతి మందిరం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు



తాటిపర్తిలో గణపతికి అన్న కుంభంతో ఉద్వాసన పలుకుతున్న అర్చకులు



ఉప్పాడలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకు వస్తున్న భక్తులు



సామర్లకోటలో ట్రాక్టర్‌పై వినాయక విగ్రహం ఊరేగింపు

నిమజ్జనోత్సవం.. అంతా సంబరం

కొత్తపల్లి: గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగుస్తుండడంతో ఉప్పాడ, పొన్నాడ శివారు సాగర తీరం గణనాథుని విగ్రహాల నిమజ్జనాలతో గురువారం కళకళలాడింది. సుమారు 150కు పైగా విగ్రహాలను సాగరంలో నిమజ్జనం చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకూ ఈ కార్యక్రమం జరిగింది. మండలంలో ఇసుకపల్లి, యండపల్లి, కోనపాపపేట తదితర గ్రామాల్లో ఉన్న వినాయక విగ్రహాలను మేళతాళాలు, బాణసంచా కాల్పులతో ఊరేగించారు. అనంతరం ఉప్పాడ సముద్రంలో నిమజ్జనం చేశారు. తర్వాత భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కొత్తపల్లి, వాకతిప్ప, ఉప్పాడ, కొమరగిరి, మూలపేట, కుతుకుడుమిల్లి శివారు నిదానం దొడ్డిలో ఏర్పాటు చేసిన గణపతి మందిరాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపల్లి శ్రీరుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి ఆలయం సమీపంలో లక్ష్మీగణపతి మందిరం వద్ద అన్న సమారాధనలు నిర్వహించారు. స్థానిక ఎంపీపీ పాఠశాల వద్ద గణపతి ఆలయం వద్ద అన్న సమారాధన జరిగింది.

పిఠాపురం: గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గణపతి ఆలయంలో వినాయక స్వామికి 108 కిలోల అన్న కుంభంతో నివేదన చేశారు. ఆలయ అర్చకుడు ఆకొండి ప్రభాకరశాస్త్రి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి ఉద్వాసన పలకగా, అనంతరం ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు.



కొత్తపల్లిలో వేణుగోపాలస్వామి ఆలయం వద్ద గణపతి మందిరంలో స్వామికి స్వీట్ల నైవేద్యం